# భారీ ఫీజులూ - భయంకర వ్యాధులూ !

ఆరోజు స్కూలుకి డాక్టరుగారొస్తున్నారు. చదవుకోవటానిక్కాదు –పిల్లల ఆరోగ్యాలని పరీక్ష చేసేందుకు.

ఆ డాక్టరుగారి పేరు శివకామయ్య. ఆర్నెల్లకోసారి అలా వచ్చి పిల్లలందర్నీ పరీక్షలు చేసి చీటీలు వ్రాసిచ్చి వెడుతుంటాడు.

అలా చేసిందనందుకు సీతారత్నం అతగాడికి కొంతమొత్తం ముట్టచెబుతుంది – అది మొదట్నించి వస్తున్న ఆచారంలాంటి అలవాటు

సీతారత్నం ఏపని చేసినా ఒక పద్దతి ప్రకారం చేస్తుంది. మంచిగాని చెడుగాని ఏపనైనా అలా చెయ్యటం ఆవిడకలవాటు . అంచేతే ఆవిడ తప్పుడు పన్చేసినా ఎవ్వరూ తప్పుపట్లేరు.

స్కూలు మొదలుపెట్టాలని అనుకున్నప్పుడే ఆ స్కూలుని ఎలా నడపాలి. అనే విషయంలాపై స్థూలంగా కొన్ని నిర్ణయాలు చేసేసుకుంది. వాటిల్లో వైద్య పరీక్ష వొకటి. చదువు చెప్పినా చెప్పకపోయినా పైపై హంగులు, ఆడంబరాలూ వుంటే జనం పట్టించుకొనరని పైగా ఎగబడి వెర్రిగా పిల్లల్ని చేర్పిస్తారని ఆవిడ పసిగట్టింది. చదవు చెప్పటం అనేది కాని పని కాబట్టి మిగతా విషయాల్లో చాలా జాగ్రత్తగా వుంటుంది.

శివకామయ్య ఆవిడ కెలా పరిచయమోఎవ్వరికీ తెలీదు. అది సృష్టి రహస్యంలాగా అంతుట్టని విషయం. శివకామయ్యకి ముప్పై ఏళ్ల అనుభవమున్నా , కాంప్లికేటెడ్ కేసొస్తే ఇప్పటికీ కంగారు పడతాడు. ఇంజక్షన్ చెయ్యాలంటే కాస్త కంగుతాడుగాని, ఎబార్షన్లు బాగా చేస్తాడని ప్రతీతి. సర్టిఫికెట్లు గూడా ధారాళంగా ఇచ్చేసి పుచ్చేసుకుంటుంటాడు. మరి ఈ సర్టిఫికేట్స్ మరియు అబార్షన్స్ డాక్టరు సీతారత్నాకెలా పరిచయమో ఎవ్వరికీ తెలీదు.

ఆ రోజు సరిగ్గా పదింటికి శివకామయ్య చిన్న బ్యాగ్, స్టెత్‌తోను స్కూలు కొచ్చాడు.

శివకామయ్య కార్ఖానా తెరచి పనిప్రారంభించేరు.

ఒక్కక్క పిల్లవాడిని పిలవటం పేరు గోత్రాలు వగైరాలడిగి చిన్న కాగితంపైని వ్రాయటం, ఆపైన పిల్లాడి నాడి , కళ్లు చూసి అవసరమైతే స్టెత్‌తో గూడా గుండెలు

పరీక్షించి , ఒకటిరెండు ప్రశ్నలడిగి, తిరిగి వాటిని కాగితంపై గిలికి, సంతకం పెట్టి ఆ కాగితాన్ని పిల్లాడికిచ్చి, ఆ పిల్లాడిని వెళ్ళమనటం – ఇదీ తంతు.

నలుగురు పిల్లల తర్వాత చిట్టి వచ్చి ఆయన ముందు నిల్చున్నాడు. ఆ వెనకే పొట్టి తయారుగా వున్నాడు.

శివాకామయ్య యాంత్రికంగా చిట్టిని పరీక్ష చేస్తుండగా, ఎక్కడ్నించో, వినిపించింది భయంకరమైన దగ్గు, తెరలుతెరలుగా , ఖళ్ళు ఖళ్ళున నరాల్ని తెంపేస్తున్నట్లు , గుండెలని చీలుస్తున్నట్లు, ఎడతెరపి లేకుండా అదే పనిగా వినిపిస్తోంది.

పనిలోవున్న డాక్టరుగారు చేస్తున్న పనాపేశారు. కనుబొమ్మల్ని పైకెత్తి ఆశ్చర్యాన్ని అనుమానాన్ని ప్రకటించేరు. అప్పటికీ ఆ దగ్గు ఆగింది కాదు. ఇంకా వుధృతంగా వినిపిస్తూనే ఉంది. ‘ ఎవరాదగ్గేది ’ అన్నారు తనలో తాను అనుకుంటున్నట్లు, కాని చిట్టి అలా అనుకోలేదు. ఆ ప్రశ్న తనకేసుకుని ‘ మా తెలుగు టీచరు ’ అన్నాడు. శివకామయ్యగారు చిట్టిని తేరపార చూసి ‘ ఎప్పుడూ అలా దగ్గుతూనేవుంటుందా ’ అనడిగారు.

‘ క్లాసులో గూడా పాపం టీచరుగారు దగ్గు తారండి. దగ్గి దగ్గి అప్పుడప్పుడు ఏడుస్తారు గూడానండి ’ అన్నాడు.

ఆమాట విన్నాక ఆయన మరింక ఆలస్యం చేయకుండా ఆ టీచర్నిలా పిలవండి అన్నారు. ఆ మాటవిని పొట్టి రివ్వున బయటికి పరిగెత్తాడు.

కొద్ది నిముషాల తర్వాత తెలుగు టీచరర్ క్రిష్ణవేణి గదిలోకొచ్చింది.

ఆవిడ్ని చూడంగానే శివకామయ్య గారికి జబ్బేమిటో అర్ధమయ్యింది. నిర్ధారణకి రెండు మూడు ప్రశ్నలడిగాడు – ఆయన అనుమానం నిజమైంది అంతలో ఆవిడకి తిరిగి దగ్గు తెర రావటం చేత నోటికట చెంగడ్డం పెట్టుకుని బయటకి పరిగెత్తింది తిరిగి ఆమె రాలేదు.

ఆ సాయంత్రం డాక్టరు, పిల్లలూ , టీచర్లు వెళ్ళిపోయాక , సీతారత్నం క్రిష్ణవేణి గదిలోకి పిలిపించి డాక్టరు చెప్పిన విషయాన్ని చెప్పింది.

“ శివకామయ్య నీకు టీబీ అన్చెప్పాడు. ఎక్స్‌రే తీయించి . ఇంజక్షన్లు, బిళ్ళలూ కొన్నాళ్ళపాటు వాడాల్ట –కొంచెం అశ్రద్ద చేసి ఆలస్యం చేసావని, అంచేత కొన్నాళ్ళ పాటు పిల్లలికి దూరంగా వుంటే మంచిది అన్నాడు. కొన్నాళ్ళు మానేసి , ఆరోగ్యం కుదిరాక వద్దూగాని అంది.

ఆ మాట విన్న క్రిష్ణవేణి  గుంటకళ్ళు నీటి  మడుగులయ్యాయి.  పాలిపోయిన మొహం నల్లబడింది.

ఆవిడ్ని భర్తవదిలేసాడు.  ఇద్దరు పిల్లల్ని  బతికించకుని  తనూబతకాలి.  ఆధారాలు , ఆస్తులు చదవులూ  లేవు.  సీతారత్నం ఆవిడ  పరిస్థితికి జాలిపడి, తనకులమే  అని తెల్సుకుని  టీచరు  ఉద్యోగమిచ్చింది.  ఈ వుద్యోగం  లేకపోతే  ముగ్గురి బతుకులకి తెరపడుతుంది.

క్రిష్ణవేణి  మౌనంగా  నిల్చుని పమిట చెంగుతో  వరదలా తోసుకొస్తున్న కన్నీటిని తుడచుకుంటోంది.  సీతారత్నానికి  ఆవిడ్ని చూస్తుంటే  కడుపుతరుక్కుపోయింది.
“ పోన్లేండి  స్కూలుకి  వస్తూనే వుండండి . కాని  కాస్త  ఆ ఇంజక్షన్లూ  మందులూ వాడండి ” అంది.

క్రిష్ణవేణికి  తిరిగి  దగ్గు తెరొచ్చింది.

ఆవిడ  పరిస్థితికి  జాలితో, సానుభూతితో, మానవత్వంతో  ఒక కన్నీరు బొట్టు కారుద్దాం.

కాని – జాలి, సానుభూతి , మానవత్వాల పేరిట రేపటి పౌరుల  ఆరోగ్యాలతో ఆడుకుంటున్న సీతారత్నంలాంటివాళ్ళ అజ్ఞానాన్ని,  అహంకారాన్ని, నిర్లక్ష్యాన్ని  చూసి రెండు కన్నీటి  బొట్లు కార్చాలి తప్పదుమరి.

------- అయ్యిపోయింది -------